ప్రజాశక్తి

గురువారం 11 సెప్టెంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ముగింపు దశకు ఖరీఫ్

పల్నాడులో తొలగని మందగమనం - గుంటూరు జిల్లాలో 90 శాతం విస్తీర్ణంలో పైర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఖరీఫ్ సాగు ముగింపు దశకు చేరుకుంది. గుంటూరు జిల్లాలో 90 శాతం పొలాల్లో పంటలు సాగవ్వగా పల్నాడు జిల్లాలో మందగమనం కొనసాగుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా ఈ ఏడాది పల్నాడు జిల్లాలో వరి సాగు పూర్తి స్థాయిలో జరగలేదు. 96,500 ఎకరాల్లో వరి సాగవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 56,500 ఎకరాల్లోనే సాగైంది. ఇంకా 40 వేల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉంది. 53 వేల ఎకరాల్లో కంది సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 38 వేల ఎకరాల్లోనే వేశారు. ఇంకా 15 వేల ఎకరాల్లో కంది సాగు పెండింగ్‌లో ఉంది. 2.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా 1.75 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా దాదాపు 75 వేల ఎకరాల్లో పత్తిపంట వేయాల్సి ఉంది. అయితే పత్తి సాగుకు సమయం దాదాపుగా ముగింపు దశకు వచ్చిందని, గరిష్టంగా సెప్టెంబరు 15లోగా పత్తి వేయకుంటే తర్వాత వేసినా అక్టోబరు, నవంబరులో వచ్చే తుపాన్లు వల్ల నష్టం జరిగే



పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం ప్రాంతంలో సాగవ్వని పొలాలు

అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొత్తం నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 2.70 లక్షల ఎకరాల్లోనే వరి, పత్తి, కంది, ఇతర పంటలు సాగు చేశారు. మొత్తం 1.30 లక్షల ఎకరాల్లో ఇప్పటి వరకు ఎటువంటి పంటలు వేయలేదు. ఉద్యాన శాఖ పరిధిలో ఉన్న మిర్చి సాగు పల్నాడు జిల్లాలో 1.20 లక్షల ఎకరాలలో సాగు చేయాల్సి ఉండగా 10 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. మిర్చి సాగుపై ఈ ఏడాది రైతులు ఇంకా పూర్తి స్థాయిలో ధైర్యం చేయలేకపోతున్నారు. మిర్చి సాగుకు అక్టోబరు చివరి వరకు అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

గతేడాది ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ఇప్పటి వరకు పత్తి, మిర్చి, వరి, కంది వంటి ముఖ్యమైన పంటల సాగు కూడా పూర్తి స్థాయిలో జరగలేదు. పల్నాడు జిల్లాలో తొలుత 4.55 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేయగా రాజధానికి రెండో విడత భూ సమీకరణతో చాలా మంది ఎటువంటి పంటలు వేయకుండా రియల్ ఎస్టేట్ కోసం భూములను ఖాళీగా ఉంచడంతో అధికారులు ఈ అంచనాలను నాలుగు లక్షల ఎకరాలకు విస్తీర్ణాన్ని కుదించారు. గుంటూరు జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 2 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, ఇతర పంటల సాగు జరిగింది. ప్రధానంగా జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దీంట్లో 70 వేల ఎకరాల్లో వరి పైర్లు అధిక వర్షాల వల్ల

▶ 2లో

నేపాల్‌లో చిక్కుకున్న మంగళగిరి వాసులు

వీడియోకాల్ ద్వారా మాట్లాడిన మంత్రి లోకేష్ - క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణానికి చెందిన 8 మంది నేపాల్‌లో ఉన్నారు. ఈనెల 1వ తేదీ నుండి 14వ తేదీ వరకు ముక్తినాథ్ యాత్ర సందర్భంగా వారు గతనెల 31వ తేదీ రాత్రి బయలుదేరి వెళ్లారు. భారతదేశంలో కాశి, ఇతర దేవాలయాలను సందర్శించడానికి వెళ్లి చివరకు నేపాల్‌లోని ఖాట్మండుకు చేరారు. అక్కడ ఆందోళనలు తీవ్రంగా ఉండటంతో చిక్కుకుపోయారు. వీరితో మంత్రి నారా లోకేష్ వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్షేమంగా ఇంటికి తీసుకొచ్చే బాధ్యతను ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావుకు మంత్రి లోకేష్ అప్పజెప్పారు. నేపాల్‌లో చిక్కుకున్నవారిలో మాచర్ల హేమ సుందర్‌రావ్, వెంకట నాగకుమారి, దామర్ల శివరామకృష్ణ, నాగలక్ష్మి, చింతక్రింది కేంద్ర ప్రసాద్, పద్మావతి, గోలి



నేపాల్‌లో ఉన్న మాచర్ల హేమసుందర్‌రావు, వెంకట నాగకుమారి... చింతక్రింది ప్రసాద్, పద్మావతి

వరదరాజు, ఆయన భార్య ఖాట్మండులో ఉన్నారు. ఈనెల 8న వీరంతా ఖాట్మండుకు చేరారు. ఆందోళనల సందర్భంగా తమ కళ్లెదుటే లూటీలు, దాడులు జరుగుతున్నాయని వారు తెలిపారు. తాము ఒక లాడ్జిలో క్షేమంగా ఉన్నట్లుగా తెలిపారు. గురువారం ఉదయం అక్కడ నుండి బస్సులో బయలుదేరడానికి ప్రయత్నిస్తున్నట్లు వారి బంధువులు తెలిపారు.




నాగరాజు మద్దిరాలకు నాయుడమ్మ పురస్కారాన్ని అందజేస్తున్న తెలంగాణ గవర్నర్

నాగరాజు మద్దిరాలకు నాయుడమ్మ పురస్కారం

- శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని ప్రజలకు చేరువచేసిన నాయుడమ్మ
- డాక్టర్ నాయుడమ్మ పురస్కార ప్రదానోత్సవ సభలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

8లో



బ్రాడీపేటలోని భారీగా చేరిన వాననీరు

గుంటూరులో కుండపోతగా వర్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 9 గంటల నుంచి ప్రారంభమైన వాన 11 గంటల వరకు కొనసాగింది. కుండపోత వానతో రహదారులపై వర్షం నీరు, మురుగునీరు పారింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మూడు వంతెనల మార్గంలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కంకర గుంట ఆర్‌యూబిలోకి వర్షం నీరు చేరి వాహన రాకపోకలు నిలిచాయి. ప్రధాన రహదారులపై వర్షం నీరు 3 అడుగుల వరకు పారడంతో వాహనదారులు ఇళ్లకు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగింది. పాదాచారులు కూడా నీళ్లలో నడిచి వెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో అపార్టుమెంట్స్‌లోని సెల్లార్లలోకి నీరు చేరింది. బ్రాడీపేట, లక్ష్మీపురం, పట్టాభిపురం, మార్కెట్ సెంటర్, విద్యానగర్, అమరావతి రోడ్డులో భారీగా వాననీరు చేరింది. నగరంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం దృష్ట్యా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఆదేశించారు.

విజయవాడ ఎంబివికెలో నేడు

'వర్తమాన పరిస్థితులు - సిపిఎం వైఖరి'పై సదస్సు

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి -విజయవాడ

సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం సాయంత్రం 6.30 గంటలకు 'వర్తమాన పరిస్థితులు - సిపిఎం వైఖరి' అనే అంశంపై సదస్సు జరుగుతుంది. విజయవాడ గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం (చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియం)లో జరిగే సదస్సులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి మాట్లాడతారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అధ్యక్షత వహిస్తారు.

ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



భూమి కోసం, భుక్తి కోసం ఐలమ్మ పోరాటం

ప్రజాశక్తి- తాడేపల్లి

భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో స్ఫూర్తివంతమైన పాత్ర వహించిన వీరవనిత చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతిని స్థానిక కొత్తూరులోని రజక కళ్యాణ మండపం వద్ద బుధవారం నిర్వహించారు. 2000 సంవత్సరంలో దీంతోపాటు విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన సత్తెనపల్లి రామకృష్ణ 25 వర్ధంతి సభలను నిర్వహించారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుండి పీడిత ప్రజలను విముక్తి చేయడానికి ఆ ప్రజలను ఏకం చేసి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో తుపాకీ చేత పట్టి తెలుగు ప్రజల పోరాట స్ఫూర్తిని, తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేస్తూ అప్పటి విద్యుత్ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన సత్తెనపల్లి రామకృష్ణ ఆదర్శనీయుడన్నారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫలితంగా ఆనాడు పది లక్షల ఎకరాలు భూమిని పీడిత ప్రజలకు పంపిణీ చేశారన్నారు. తొలుత ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు రజక వృత్తిదారుల సంఘం మంగళగిరి తాడేపల్లి నగర అధ్యక్ష- కార్యదర్శులు ఉండవల్లి పార్థసారథి, పాగోలు శ్రీనివాసరావు పూలమాలలేసి నివాళులర్పించారు. నాయకులు టి.సాంబశివరావు, ఎస్.శివయ్య, డి.వీరాంజనేయులు, కె.యానాదిరావు, కె.శ్యామ్, యు.దుర్గారావు, అప్పారావు, టి.వెంకటరమణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ముగింపు దశకు ఖరీఫ్

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతింది. ఇందులో కొంత భాగంలో పైర్లు నిలదొక్కుకున్నాయని అధికారులు తెలిపారు. ఎక్కువ మంది రైతులు ఈసారి వెదపద్ధతిలో సాగు చేశారు. కొంత మంది నాట్లు వేసే పద్ధతిని అవలంభిస్తున్నారు. ప్రస్తుతం తాడికొండ, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో 50 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా ఉండగా ఇప్పటి వరకు 44 వేల ఎకరాల్లో సాగు చేశారు. మరో 20 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. 40 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేయాల్సి ఉండగా రైతులు తటపటాయిస్తున్నారు. 4 వేల ఎకరాల్లోనే మిర్చి సాగైంది. జిల్లాలో రాజధాని రియల్ ఎస్టేట్ ప్రభావం కూడా జిల్లాలో అధికంగా ఉండటం వల్ల అధికారులు ముందుగానేసాగు విస్తీర్ణం అంచనాలను తగ్గించారు. గతేడాది 3.34 లక్షల ఎకరాల్లో పంటల సాగు అంచనా వేయగా ఈ ఏడాది దీనిని 2.25 లక్షలకు తగ్గించారు.

వీరనారి ఐలమ్మ నేటి యువతకు స్ఫూర్తి

ప్రజాశక్తి-గుంటూరు



నివాళి అర్పిస్తున్న నాయకులు

తెలంగాణ సా యుధ పోరాటం యోధురాలు వీరనారి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా స్థానిక విద్యానగర్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఐలమ్మ విగ్రహానికి బిసి సంక్షేమ సంఘం నాయకులు నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొని పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ భూమి కోసం, భుక్తి కోసం పేదల విముక్తి కోసం భూస్వామ్య వ్యవస్థను కూకటి వేళ్లను పెకిలించిన సాయుధ పోరాటంలో శ్రామిక జనానికి అండగా సామాన్య స్త్రీ ఐలమ్మ చాటిన ధీరత్వం నేటికీ ఆదర్శమని అన్నారు. తనపై తప్పుడు కేసులు బనాయించిన దొరలకు సవాల్ విసిరి కోర్టులో కేసు గెలిచి చరిత్ర సృష్టించిందన్నారు. తిరుగుబాటుకు ఐలమ్మ స్ఫూర్తి అని, ఆమె వారసత్వాన్ని నేటి యువతీ యువకులు స్వీకరించాలని, నేటి ఆదిపత్య కుల సమాజంలో అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయయాలపై నిత్యం ఉద్యమించా లన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్, నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, రామకష్ణ, ఎం.వెంకటకోటయ్య తదితరులు పాల్గొన్నారు. పొన్నూరులో ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఐలమ్మ సభ నిర్వహించారు.

రేపు బిసిల నిరసన ర్యాలీని విజయవంతం చేయండి...

చట్ట సభల్లో, స్థానిక సంస్థల్లో జనాబా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని, కులగణన, బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్లతో ఈనెల 12న ఉదయం 10 గంటలకు మార్కెట్ సెంటర్‌ని పూలే విగ్రహం నుండి కలెక్టరేట్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ తెలిపారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.



పిహెచ్‌డి పొందిన ఆరాధ్యశర్మను సన్మానిస్తున్న వి జె కాలేజీ యాజమాన్యం

వి.జె కళాశాల అధ్యాపకునికి పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక వి.జె కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకులు బి.వి.ఎల్ ఆరాధ్య శర్మ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పొందినట్లు కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ ప్రెగడ రాజశేఖర్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో రాజశేఖర్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని జంతుశాస్త్రం ఆక్వాకల్చర్ విభాగం ప్రొఫెసర్ పి.వి. కృష్ణ మార్గదర్శకత్వంలో ఈ పరిశోధన పూర్తిచేసి డాక్టరేట్ పొందినట్లు ఆయన తెలియజేశారు. హెల్త్ ఆప్టిమైజేషన్ కోసం వలస సమయంలో హిల్సాలో పోషక మరియు ఫాటీయాసిడ్స విశ్లేషించే పద్ధతిపై పేటెంట్ పొందిన నలుగురిలో ఒకరు ఆరాధ్య శర్మ అని రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలోమేనేజ్మెంట్ మరియు సహచర అధ్యాపకులు డాక్టర్ ఆరాధ్య శర్మను శాలువా మరియు పుష్పగుచ్చాలతో అభినందించారు

నేడు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 49వ వ్యవస్థాపక దినోత్సవం

హాజరు కానున్న మాజీ ఉపకులపతులు - ఘనంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

బోధన, పరిశోధన అగ్రగామిగా నిలుస్తూ... ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ విద్యా సుగంధాలను వెదజల్లుతూ.. రాజధాని విశ్వవిద్యాలయం గా ఖ్యాతి గడించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 49వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకకు సిద్ధమైంది.

స్థాపన మరియు ప్రారంభ దశ

తొలుత గుంటూరు, కృష్ణ, ప్రకాశం ప్రాంత ప్రజల ఉన్నత విద్యా అవసరాలను తీర్చడానికి 1970లో గుంటూరు జిల్లా నల్లపాడులో ఆంధ్ర విశ్వవిద్యాలయం పోస్ట్-గ్రాడ్యుయేట్ కేంద్రంగా ప్రారంభమై, 1976 సెప్టెంబర్ 11వ తేదీ స్వతంత్ర విశ్వవిద్యాలయంగా నాగార్జున విశ్వవిద్యాలయం పేరుపొందింది. అప్పటి భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ చేతుల మీదుగా సుమారు300 ఎకరాల విస్తీర్ణంలో గుంటూరు, విజయ వాడ ప్రాంతాల మధ్య ఏర్పాటు చేయబడింది. గొప్ప బౌద్ధ తత్వవేత్త ఆచార్య నాగార్జునుడి స్మారకార్థం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంగా పేరు గడించి ఈ ప్రాంతంలోని చారిత్రక, విద్యా వైభవాన్ని కనబరిచింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆర్ట్స్ , సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ వంటి ఆరు కళాశాలలు ఉన్నాయి. నేడు రెగ్యులర్ విధానంలో 65 యుజి,పిజి, వృత్తి విద్య కోర్సులు, దూరవిద్య విధానంలో 43 కోర్సులు అందిస్తుంది. సి ఎస్ ఆర్, సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యయన కేంద్రం, మహాత్మ జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం, బాబు జగ్జీవన్ రామ్ చైర్, సెంటర్ ఫర్ గాండియన్ స్టడీస్ డాక్టర్ కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం నెలకొల్పి తద్వారా విస్తృత పరిశోధనలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు వర్సిటీకి 220 అనుబంధంగా కళాశాలలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో ఇంజనీరింగ్ మరియు సైన్స్ సంబంధిత ప్రతిష్టాత్మక ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. యూజీసీ, సి ఎస్ ఐ ఆర్, ఐ సి ఎస్ ఎస్ ఆర్, డి బి టి, ఇస్రో వంటి జాతీయ సంస్థల ద్వారా రీసెర్చ్ ప్రాజెక్టులు మరియు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. వందల సంఖ్యలో ఐసిటి తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి.వర్సిటీ ప్రగతి ఆధారంగా టైర్‌టు విభాగంలో 2024లో నాక్ ఎ ప్లస్ గ్రేడ్‌ను సాధించింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో చోటు దక్కించుకుంది. సమర్థవంతమైన నిర్వహణ, ప్రతిభ ఆధారంగా యూనివర్సిటీ రూసా కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నోడల్ సెంటర్ గా గుర్తించింది. ఈ నిధుల ద్వారా వివిధ పరిశోధన కు సంబంధించిన ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయడం జరిగింది.

పూర్వ ఉపకులపతులు హాజరు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతులు గా విశిష్ట సేవలు అందించిన పలువురు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని హాజరుకానున్నారు. ప్రొఫెసర్ డి. రామకోటయ్య, ప్రొఫెసర్ సి.వి. రాఘవులు, ప్రొఫెసర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి, ప్రొఫెసర్ వి. బాల మోహన్ దాస్, ప్రొఫెసర్ వై. ఆర్. హరగోపాల్ రెడ్డి, ప్రొఫెసర్ ఏ. రాజేంద్రప్రసాద హాజరు కానున్నారు.

నేడు అంగన్‌వాడీ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు : ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా 10వ మహాసభ నేడు పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభల్లో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సుబ్బారావమ్మ, సిఐటియు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. మహాసభలో గత మహాసభ నుండి నేటి వరకూ యూనియన్ చేపట్టిన కార్యకలాపాలు, అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించుకొని భవిష్యత్ కర్తవ్యాలు నిర్దేశించుకోవటం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, యాప్‌ల పనిభారం తగ్గించుకోవటానికి తగిన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అదే విధంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకుంటామని చెప్పారు.



రూ.4.5 లక్షల ఎల్‌ఒసి చెక్కు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద వడ్లపూడి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ హెప్సీబాకు మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4,50,000 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ వో సి) చెక్కును గురువారం నాయకులు అందజేశారు. బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేసిన అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద మాట్లాడారు.ఎల్‌ఓసి చెక్కు రావడానికి కృషిచేసిన మంత్రి నారా లోకేష్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చెక్కును అందజేసిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు మాదల రమేష్ బాబు, జొన్నలగడ్డ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఏవో

ప్రజాశక్తి- పెదనందిపాడు

మండలంలోని వరగాని, అబ్బినేనిగుంటపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం బుధవారం నిర్వహించారు. రైతులం దరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించు కోవాలని తెలియజేశారు. ప్రత్తి వేసిన పొలా లను సందర్శించి రసం పీల్చే పురుగులు నివారణకు మోనోక్రోటోఫాస్ లీటర్ నీటికి రెండు మిల్లీమీటర్ల వంతున లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు కలిపి పిచికారి చేయాలని తెలిపారు. రైతులు నానో యూరియాని అరలీటర్ కలిసి ఎకరాకి స్ప్రే చేసుకున్నట్లయితే శాఖ పెరుగుదల బాగా వస్తుందని తెలియజేశారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న శ్రీనివాసరావు

వార్డు సచివాలయాల్లో తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 39, 40వ వార్డు సచివాలయాల్లో బుధవారం జిఎంసి డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లు తనిఖీ చేశారు. సచివాలయంలో నిర్వహించాల్సిన రిజిస్టర్లను అసంపూర్తిగా నిర్వహించడంపై కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో రిజిస్టర్లను సరిగా నిర్వహించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 39వ సచివాలయంకు అడ్మిన్, ఎడ్యుకేషన్ సెక్రెటరీలు లేకపోవటంతో ఇన్‌చార్జిలను నియ మించాలని మేనేజర్‌ను ఆదేశించారు. కార్యదర్శులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, కార్యాలయ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

ఉత్పత్తిదారులే నేరుగా విక్రయాలు

ఇండియన్ సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభించిన డిప్యూటీ మేయర్ సజీల

ప్రజాశక్తి -గుంటూరు



మహిళల వస్త్ర వైభవానికి పట్టు వస్త్రాలు ప్రత్యేక ముద్రను సంతరించు కున్నాయని దేశంలోనే ఎంతోమంది కళాకారులు తమ కళా నైపుణ్యంతో రూపొంది ంచిన పట్టు వస్త్రాలకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వేదికైందని, ఉత్పత్తి దారులే నేరుగా అమ్మకాలు నిర్వహించడం ద్వారా బహిరంగ మార్కెట్‌కంటే తక్కువ ధరకు వినియోగదారులకు పట్టు వస్త్రాలు అందుబాటులోకి వస్తున్నాయని గుంటూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎస్‌కె. సజీల అన్నారు. కేంద్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్లో ఐదు రోజుల పాటు నిర్వహించన్ను ఇండియన్ సిల్క్ ఎక్స్‌పోను బుధవారం డిప్యూటీ మేయర్ ఎస్‌కె. సజీల ప్రారంభించి పట్టు వస్త్రాల స్టాళ్లను తిలకించారు.దేశ వ్యాప్తంగా 14 వీవింగ్ క్లస్టర్ల పరిధిలోని కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అత్యద్భుతమైన డిజైన్లకు ఈ ప్రదర్శన చిరునామాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను నగర వస్త్ర ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ ఎస్‌కె. సజీల కోరారు. స్థానిక కార్పోరేటర్ ఎం.పద్మశ్రీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పాడ, ధర్మవరం పట్టు వస్త్రాలు తమిళనాడు, కంచిపట్టు చీరలు, కర్ణాటకలోని మైసూర్ సిల్క్ చీరలు, తెలంగాణ ప్రాంతంలోని గద్వాల్ పోచంపల్లి తదితర ప్రాంతాల వస్త్రాలు మహిళల మనసులను దోచుకునే విధంగా ఉన్నాయన్నారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిర్వాహకులు, సెంట్రల్ సిల్క్ బోర్డు విశ్రాంత డిప్యూటీ డ్కెరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్యాలరీ సెప్టెంబర్ 10వ తేదీ నుండి 14వ తేది వరకు అందుబాటులో ఉంటుందన్నారు. 100 శాతం పట్టు ఉత్పత్తులకు సిల్క్ ఎక్స్‌పో వేదిక అని తెలిపారు. దసరా, దీపావళి వంటి పండగలను దృష్టిలో పెట్టుకుని ఆదునాతన డిజ్కెన్‌లతో ఏర్పాటు చేసిన ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో మేనేజింగ్ డైంక్టర్ వై. విజయ్ కుమార్, బ్రాండ్ అంబాసిడర్ పి.దీపిక, సోషల్ మీడియా క్యాంపైనర్ జి. నందిని వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన వీవర్స్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాపై దుష్ప్రచారం తగదు

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రైతులకు సకాలంలో ఎరువులను అందిస్తున్నామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. గుంటూరులోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎరువుల సరఫరాపై వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రైతుల అవసరాల మేరకు సరఫరా, నిల్వలు ఉన్నాయన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 1191మెట్రిక్ టన్నుల యూరియా అందించామన్నారు. ఇంకా యూరియా 300టన్నులు సిద్ధంగా ఉంచామన్నారు. డిఏపికి కూడా కొరత లేదన్నారు. నిల్వలు ఉన్నాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని 5మండలాల్లో ప్రతి ఒక్క రైతుకు పకడ్బందీగా ఎరువులు, విత్తనాలు అందించామని తెలిపారు. కొంతమంది రైతులు అదనంగా ఎరువులు తీసుకున్నారని తెలిపారు. యూరియా కొరత ఉందని వైసిపి నాయకులు పుకార్లు పుట్టిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంతో వైసిపి నాయకులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందన్నారు. తురకపాలెం గ్రామంలో సాధారణ పరిస్థితి నెలకొందని, గ్రామస్తులకు అండగా ఉంటామన్నారు. గతంలో కొంతమంది అధికారుల అలసత్వం వలన ఇంతటి పరిస్థితి నెలకొందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల పలు సమస్యలు వచ్చాయన్నారు. వీరిపై త్వరలో చర్యలు ఉంటాయన్నారు. టిడిపి నాయకులు కంచర్ల శివరామయ్య, ఎస్.పి సాహెబ్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, నాయుడు ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో రెండు మృతదేహాలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని అమరావతి రెడ్డి నగర్ సమీపంలోని బకింగ్ హోమ్ కాలువలో గుర్తు తెలియని రెండు మృతదేహాలు వారం రోజులుగా అలాగే ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో తాము ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పాడై పోయి, కుళ్లిన మృతదేహాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరుగురికి అపరాధ రుసుం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన ఆరుగురిని చిలకలూరిపేట పట్టణ పోలీసులు బుధవారం చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరు పరిచారు. జడ్జి వారికి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున రూ.60వేలు అపరాధ రుసుము విధించినట్లు పట్టణ ఎస్ఐలు రహమతుల్లా చెన్నకేశవులు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకసారి పెనాల్టీ కట్టిన వారు మరలా డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే జైలు శిక్ష వేస్తామని జడ్జి హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

యువకుడి దారుణ హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ ప్రభాకర్ (ఇన్‌సెట్‌లో) మృతుడు చంద్రశేఖర్ (ఫైల్)

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణం కోడెల శివప్రసాద్ కాలనీకి చెందిన కొందరు యువకులు అతిగా మద్యం సేవించారు. మత్తులో వారిలో వారు ఘర్షణపడ్డారు. ఘర్షణలో ఓ యువకుడు దారుణ హత్యకు గుర య్యాడు. మంగళవారం రాత్రి పట్టణ శివారులో చోటు చేసు కుంది. స్థానిక కోడెల శివప్రసాద్ కాలనీకి చెందిన తిరుమలగిరి చంద్రశేఖర్(21) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. మృతుని బంధు వులు తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో చంద్రశేఖర్ స్నేహితులు వచ్చి మద్యం తాగేందుకు తీసుకెళ్లారు. ఆరాత్రి ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో చంద్రశేఖర్ శ్రీశైలం రోడ్డు పాత డాంబర్ ప్లాంట్ సమీపంలో మృతి చెంది ఉన్నాడని కబురు అందిందని చెప్పారు. రాత్రి చంద్రశేఖర్‌తో కలసి మద్యం తాగిన వారిపైనే తమకు అనుమానం వుందని బంధువులు చెబుతున్నారు. పట్టణ సిఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హంతకులను గుర్తించేందుకు విజయవాడ నుండి జాగిలాలను తెప్పించారు. అవి మృతదేహం ఉన్న ప్రదేశం, మద్యం సేవించిన ప్రదేశంలో తిరిగి సాగర్ రింగ్ రోడ్డు వరకు వచ్చి బ్రాందీషాపుల సమీపంలో నిలిచిపోయాయి. హంతకులు హత్య చేసిన అనంతరం తిరిగి మద్యం సేవించేందుకు ఆ ప్రాంతానికి వచ్చి వుంటారని పోలీసులు భావిస్తున్నారు.అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. హంతకులను వెంటనే పట్టుకోవాలంటూ డిమాండ్ చేస్తూ గంట పాటు మృతుని బంధువులు మృతదేహాన్ని సంఘటనా స్థలం నుండి కదల నీయలేదు. అనంతరం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.



దర్యాప్తులో భాగంగా పోలీసుల జాగిలం

చోరీ కేసులో ఒకరు అరెస్టు

29.8 గ్రాముల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి- రెంటచింతల

మేజర్ పంచాయతీ రెంటచింతల పరిధిలోనే రేంజర్ వీధిలో ఆగస్టు 2న మాస్టర్ గెల్లిపోగు జనార్దన్‌రావు ఇంట్లో జరిగిన దొంగతనానికి సంబంధించి నిందితున్ని అరెస్టు చేసి నట్లు ఎస్ఐ. సిహెచ్ నాగార్జున తెలిపారు. బుధవారం స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన నిందితుడు తమ్మిశెట్టి సాయికుమార్ మాస్టర్ ఇంటి పక్కనే నివసిస్తున్నాడు. బాధితులు ఇద్దరు టీచర్లు కావడంతో వాళ్ల రాకపోకలు గమనించిన సాయికుమార్ వారు ఊరు వెళ్లడంతో దొంగతనానికి పాల్పడ్డాడని తెలిపారు. దొంగలించిన 29.8 గ్రాములు బంగారాన్ని తమ గ్రామంలోని బీడుభూమిలో దాచిపెట్టి రోజు పరిశీలిస్తున్నాడు. ఫింగర్ ప్రింట్ మ్యాచ్ కావడంతో పాటు క్లూస్ టీం ద్వారా నేరం బట్టబయలైంది. నిందితున్ని అరెస్టుచేసి గురజాల కోర్టులో హాజరపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.



సురేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

విద్యుత్ పని చేస్తూ కూలీ మృతి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ల పనుల కోసం కాంట్రాక్టర్ తరుపున వచ్చిన కాంట్రాక్టు కూలీ స్తంభంపై పనిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కిందపడి మృతిచెందాడు. జమ్మలమడక గ్రామంలో 24 గంటల విద్యుత్ సరఫరా కొరకు నూతనలైన్లు ఏర్పాటు చేసే పనులను సబ్ కాంట్రాక్టర్ చేయిస్తున్నాడు. కూలి కోసం వచ్చిన వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ళ గ్రామానికి చెందిన ముప్పారపు సురేష్(27) స్తంభంపై ఎక్కి పనులు చేస్తూ ప్రమాదానికి గురయ్యాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న డాక్టర్ కె.శ్రీనివాసులు

ఉద్యాన పంటలతో ఏడాదికి రూ.లక్షకుపైగా ఆదాయం

ప్రజాశక్తి-వినుకొండ : ఉద్యాన పంటల సాగులో రైతులు మెలకువలు పాటించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు డాక్టర్ కె.శ్రీనివాసులు సూచించారు. మండలంలోని నడిగడ్డ గ్రామంలో ఉద్యాన పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. ఉద్యాన శాఖ సహకారంతో రైతు పర్వతనేని శ్రీనివాసరావు డ్రాగన్ పండ్ల తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న మునగ తోటలను, గుండు శశిధర్ గుప్తా సాగు చేస్తున్న దానిమ్మ, బత్తాయి పండ్ల తోటలను సందర్శించారు. ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలు అందిపుచ్చుకుని ఎగుమతులకు అవకాశం ఉన్న పండ్ల తోటల సాగు చేపట్టాలని, కనీసం ఒక ఎకరాలో ఉద్యాన పంటల సాగు చేస్తే ఏడాదికి రూ.లక్ష నుండి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందొచ్చని చెప్పారు. బిందు సేద్యం, మల్చింగ్ విధానంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయాలన్నారు. పండ్ల తోటల్లో నీటి కుంటలు నిర్మించుకుని భూగర్భజల మట్టాన్ని సంరక్షించుకోవాలన్నారు. గ్రామంలోని వినుకొండ ఉద్యాన రైతుల ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ద్వారా చేపడుతున్న వివిధ రకాల కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ-క్రాప్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ.వెంకట్రావు వివరించారు. సూక్ష్మ నీటి సేద్యం జిల్లా అధికారి ఆంజనేయులు, ఉద్యాన అధికారులు షేక్.నబీ రసూల్, వై.మోహన్ పాల్గొన్నారు.


ఎంఆర్‌పికి మించి అమ్మితే చర్యలు : డిఎఒ

ప్రజాశక్తి - నకరికల్లు: ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు హెచ్చరించారు. మండలంలోని దేచవరం గ్రామంలో ఎరువుల దుకాణాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను, నిల్వలను పరిశీలించారు. నకరికల్లు మండలంలో 10750 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి, పసుపు, కంది పంటలు సాగవుతున్నాయని చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 260 టన్నుల యూరియా, 260 టన్నుల డిఎపి, పిఏసిఎస్ ద్వారా 100 టన్నుల యూరియా, 120 టన్నుల డిఎపి, 50 టన్నుల పొటాషియం మరో రెండు రోజుల్లో మండలానికి రానున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఏవో దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు, సత్తెనపల్లి రూరల్ : యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు అన్నారు. పెదకూరపాడు మండలంలోని తాళ్లూరులో 19.8 మెట్రిక్ టన్నుల యూరియాను ఆయన బుధవారం అందించారు. రైతు అవసరాలకు మాత్రమే యూరియా తీసుకోవాలని, నానో యూరియా, నానో డిఏపిని పంటకు పైపాటుగా పిచికారి చేసుకోవాలని సూచించారు. 75 తాళ్లూరు పిఏసిఎస్ అధ్యక్షులు వై.రత్నకుమార్, మండల ప్రత్యేక అధికారిషేక్ మహబూబ్ సుభాని, తహశీల్దార్ ఎన్.ధనలక్ష్మి, ఎంపిడిఒ సోమయాజులు, ఏవో డి.కృష్ణయ్య, పిఏసిఎస్ డైరెక్టర్ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు. సత్తెనపల్లి మండలంలోని దూళిపాళ్లలో రైతులకు యూరియా వాడకంపై అవగాహనలో రవిబాబు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోతుందని, సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఏవో బి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ అవసరం మేరకు రైతులందరికీ ఎరువులను అందిస్తామని చెప్పారు. అనంతరం ఎబిఎఫ్ఎస్ఎస్ ఎరువుల పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేశారు

65 శాతం పొలాలు ఖాళీ

- ఏ పంట వేయాలో తెలీక సాగుకు జంకుతున్న రైతులు
- వరుస నష్టాలతో ఆందోళన
- ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడంలో వ్యవసాయ శాఖాధికారుల నిర్లిప్తత



కావూరు, గణపవరం గ్రామాల్లో ఖాళీగా ఉన్న పొలాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నిత్యం సమస్యలతో సతమతమవుతున్న రైతు వ్యవసాయం అంటేనే జంకుతున్నాడు. మిర్చికి మినహా మరే ఇతర పంటలనూ దాచుకునే వీల్లేని పరిస్థితి, దాచుకుందామన్నా ఎప్పటికీ మద్దతు ధర దక్కని దుస్థితితో నష్టాలనే రైతు మూటగట్టుకుంటున్నాడు. ఇవన్నీ కలిసి ఏటికేడు సాగు విస్తీర్ణం తగ్గేలా చేస్తున్నాయి.

పట్టణంతోపాటు మండలంలో 23 పంచాయతీల పరిధిలోని 29 గ్రామాల్లో 13 వేల ఎకరాల సాగు భూమి ఉంది. పత్తి, శనగ, మిర్చి పంటలు ఎక్కువగా సాగవుతుంటాయి. ఆ తర్వాతి స్థానంలో పొగాకు ఉంటుంది. గతేడాది ఆగస్టు చివరి నాటికి మండలంలో 6426 ఎకరాలు సాగవ్వగా ఈ ఏడాది ఇప్పటి వరకు 4610 ఎకరాలే సాగులోకి వచ్చింది. గతేడాదితో పోలిస్తే 1816 ఎకరాలు తక్కువగా సాగవగా మొత్తం సాగు భూమిలో ఇంకా 8390 ఎకరాలు ఇంకా సాగుకు నోచక ఖాళీగా దర్శనమిస్తోంది. అంటే మొత్తం సాగు భూమిలో 65 శాతం పొలాలు ఖాళీగా ఉండగా 35 శాతమే సాగులోకి వచ్చింది. పంటల వారీగా పరిశీలిస్తే... గతేడాది 251 ఎకరాల్లో వరి సాగవగా, ఈ ఏడాది 55 ఎకరాలకు, పత్తి 4250 ఎకరాల నుండి 3875 ఎకరాలకు పరిమితమైంది. గతేడాది మిర్చి 959 ఎకరాలు సాగవగా ఇప్పుడు 100 ఎకరాలకు పడిపోయింది. 58 ఎకరాల్లో సాగైన సోయాబీన్ ఇప్పుడసలు వేయనేలేదు. జ్యూట్ 157 ఎకరాల నుండి 185 ఎకరాలకు, కంది 521 ఎకరాల నుంచి 250కు, నల్ల పెసలు 53 ఎకరాల నుండి 50 ఎకరాలకు తగ్గింది. మొక్కజొన్న మాత్రం 77 ఎకరాల నుండి 150 ఎకరాలకు, రెండెకరాల్లో సాగైన పచ్చ పెసలు 5 ఎకరాలకు పెరిగాయి. 5500 ఎకరాల్లో సాగైన పొగాకు, 2200 ఎకరాల్లో సాగైన శనగ, ఈ ఏడాది నిలిచాయి. పొగాకును సాగుచేయొద్దని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెలాఖరులోగా శనగ, మొక్కజొన్న పంటల సాగుకు అవకాశం ఉన్నా గతేడాది అనుభవాల దృష్ట్యా ఇప్పుడు ఎంతవరకు సాగవుతాయనేది స్పష్టత లేదు.

మండలంలో ఎక్కువ భూమి వర్షాధారం, లిఫ్ట్ ఇరిగేషన్ల మీద ఆధారపడిన కారణంగా వరి సాగు క్రమంగా తగ్గుతూ వస్తోంది. తెగుళ్లు, పురుగు, మద్దతు ధరలేకపోవడం తదితర కారణాలతో మిర్చి సాగుకు రైతులు భయపడుతున్నారు. శనగను సాగుచేసినా అందులోనూ ప్రతికూల పరిస్థితులే ఎదురయ్యాయి. గతంలో రూ.20-25 వేలతో ఎకరా కౌలుకు తీసుకుని రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టి శనగ సాగు చేశారు. సాధారణంగా 12-15 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 7-8 క్వింటాళ్లకు మించి రాలేదు. దిగుబడిని ఎండు తెగులు తీవ్రంగా దెబ్బతీసింది. దీనికితోడు క్వింటాక్ ధర రూ.10-12 వేలు ఉండాల్సింది రూ.6 వేలకు మించలేదు. కొంత పంటనైతే నాణ్యత పేరుతో రూ.5 వేలకూ అమ్ముకోవాల్సి వచ్చింది. తీవ్ర నష్టాలను చవిచూసిన రైతులు శనగ సాగునూ తగ్గించారు. మరోవైపు ఆటుపోట్లను అధిగమించడానికి రైతులకు దన్నుగా నిలవాల్సిన వ్యవసాయ శాఖ మండలంలో స్తబ్దుగా తయారైంది. తెగుళ్ల నివారణలో రైతులకు సూచనలివ్వడం, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించ సలహాలివ్వడం వంటివేమీ చేయడంలేదని, తమను పూర్తిగా విస్మరించారనే విమర్శలు రైతుల నుండి వస్తున్నాయి. ఈ పరిస్థితులన్నింటి దృష్ట్యా మండలంలో వ్యవసాయం ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది.



వీరనారి ఐలమ్మకు ఘన నివాళులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చాకలి ఐలమ్మ సేవా సమితి వ్యవస్థాపకులు మన్యం పాండురంగారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షేక్ జలీల్, మునయ్య, పాషావలి హాజరై మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్రను వివరించారు. రిటైర్డ్ హెచ్ఎం పాపిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఐలమ్మ చిత్రపటానికి అమరావతి సేవ సమితి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సమితి అధ్యక్షులు గొల్లపల్లి వీరాంజనేయులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక చాకలి ఐలమ్మ అన్నారు. నాగమల్లేశ్వరరావు, షారోన్ కుమార్, బబ్బు, సోమశేఖర్ పాల్గొన్నారు.



కుటుంబాల్ని ఛిద్రం చేస్తున్న మద్యం

- డ్వాక్రా మహిళల సమస్యలను పరిష్కరించాలి
- ఐద్వా పల్నాడు జిల్లా మహాసభ డిమాండ్ - 19 మందితో నూతన కమిటీ



ఐద్వా జెండావిష్కరణ





నూతన కమిటీ... జమండ్లమూడి అనూష, గుంటుపల్లి రజని

ప్రజాశక్తి-సత్తెనపల్లి

గృహహింస నిరోధక చట్టం ద్వారా బాధిత మహిళలకు న్యాయం జరుగుతుందని పల్నాడు జిల్లా గృహహింస నిరోధక చట్టం సోషల్ కౌన్సిల్ సంగీత అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పల్నాడు జిల్లా మహాసభ మండలంలోని రెంటపాళ్లలో కళ్లం మునెమ్మ ప్రాంగణంలో బుధవారం జరిగింది. మహాసభకు గద్దె ఉమశ్రీ అధ్యక్షత వహించగా సంగీత ప్రారంభోపన్యాసం చేశారు. మహిళలపై హింస కొనసాగుతూనే ఉందని అన్నారు. 2006లో ఐక్యరాజ్య సమితి 'అన్ని రూపాల వివక్షత నిర్మూలన సదస్సును' ఏర్పాటు చేసి ఆ సదస్సులో మహిళల రక్షణకై గృహహింస నిర్మూలన చట్టాన్ని తెచ్చిందని అన్నారు. ఐసిడిఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు సిడిపిఒ శీలత మాట్లాడుతూ బాల్యవివాహాలు ఇంకా జరుగుతున్నాయని, కొన్నింటిని మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది నివారించినా తర్వాత గుట్టు చప్పుడు కాకుండా చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. 21 ఏళ్లు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయిందని, ఇది రైతులతోపాటు మహిళల ఉపాధిపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని చెప్పారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, మద్యం షాపులతోపాటు బెల్టు షాపులు కూడా విచ్చలవిడిగా పెరిగిపోయాయని అన్నారు. వ్యవసాయ కార్మిక కుటుంబాలకు వచ్చే చాలీచాలని ఆదాయాలు కాస్త మద్యం షాపులకే చేరుతూ వారి కుటుంబాలు చిన్నాభిన్నమౌతున్నాయని చెప్పారు. మద్యం షాపులను నియంత్రించాలని, బెల్టు షాపులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది.

19 మందితో నూతన కమిటీ

మహాసభలో 19 మందితో పల్నాడు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా జమండ్లమూడి అనూష గుంటుపల్లి రజనీ ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీర బ్రహ్మం సోహార్దక సందేశాన్నిచ్చారు.

తొలుత ఐద్వా జెండాను సిహెచ్ నాగేంద్రమ్మ ఆవిష్కరించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారులు దుగ్గి నాగేశ్వరరావు బృందం గేయాలు ఆలపించగా గర్ల్స్ హైస్కూల్ బాలికల బృందం నృత్యరూపకాలు ప్రదర్శించారు. ఎం.జ్యోతి, ఆర్.పార్వతి, టి.విజయ్‌కుమారి, కె.సుధారాణి, ఎస్.దుర్గాబాయి, డి.సుజాత, జి.ఎలిసెమ్మ, ఎన్.సరస్వతి, పి.భారతి, డి.విమల, డి.సత్యవతి, నాగమ్మ బాయి, ఎం.రామకుమారి, కె.నాసర్‌బీ, బి.రామారావు, ఎం.నరసింహారావు, పి.మహేష్, జె.భగత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ

వేతనాల పెంపు కోసం ఉద్యమిస్తాం..

ప్రజాశక్తి - మంగళగిరి

ఆశా వర్కర్ల వేతనాల పెంపు కోసం ఉద్యమం చేస్తామని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఎన్.రమణ అన్నారు. బుధవారం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్ల యూనియన్ మహాసభ జరిగింది. సభలో రమణ మాట్లాడుతూ ఆశా వర్కర్లు అనేక పోరాటాలు చేసి 94 జీవోను సాధించుకున్నామని తెలిపారు. వేతనాల పెంపు కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. వేతనాలు పెంచి ఆరు సంవత్సరాలు దాటిందని, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా పెంపు కోసం రానున్న కాలంలో ఉద్యమం చేస్తామని అన్నారు. ఆశా వర్కర్లకు రాజకీయ వేధింపులు పెరిగిపోతున్నాయని అన్నారు. ఆశా వర్కర్లు ఆరోగ్యపరంగా ప్రజలకు సేవ చేసే వారిని అన్నారు. అలాంటి వారిపై రాజకీయ వేధింపులు చేయడం సరికాదని అన్నారు. ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే పే స్కేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదివేలు వేతన పొందేవారు గవర్నమెంట్ ఉద్యోగుల అని ప్రశ్నించారు. ఉద్యోగులు పేరుతో వారికి వస్తున్న సంక్షేమ పథకాలు నిలిపివేయడం సబబు కాదని అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వారికి సంక్షేమ పథకాలు కల్పించాలని కోరారు. ఆశా వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి హక్కులను సాధించుకున్నామని తెలిపారు. యూనియన్ సభ్యులంతా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అనేక ప్రాంతాలలో అనేక వేధింపులకు గురవుతున్నారని, వాటిని నిలవరించాలంటే సమైక్యంగా ఉండి ఉద్యమించాలని అన్నారు. అనంతరం ఆశా వర్కర్ల యూనియన్ పట్టణ కమిటీ 11 మందితో ఎన్నికైంది. అధ్యక్షురాలుగా మహాలక్ష్మి, కార్యదర్శిగా కె.శ్రావణి ఎన్నికయ్యారు. మహాసభలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ పాల్గొన్నారు



మాట్లాడుతున్న నాయకులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కార్మిక వర్గ సమస్యలు పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే శరణ్యమని సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. బుధవారం కుంచనపల్లిలో సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నేతాజీ మాట్లాడుతూ పాలకవర్గాలు యాజమాన్యాలకు కొమ్ముకాస్తూ, అన్ని వర్గాల కార్మికులపై పని ఒత్తిడి భారాన్ని పెంచుతున్నాయని ఆయన విమర్శించారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయకపోగా ఉన్న కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని ఆయన అన్నారు. కార్మికుల హక్కుల కోసం సిఐటియు అన్ని ట్రేడ్ యూనియన్లను కలుపుకొని నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ఈ ఐక్య పోరాటాలలో అన్ని వర్గాలు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కుంచనపల్లి గ్రామంలో అన్ని వర్గాల కార్మికులతో కమిటీని ఏర్పాటు చేశారు. సిఐటియు కుంచనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా టీ దయామణి, కార్యదర్శిగా కోలంటి శ్యామల, ఉపాధ్యక్షురాలుగా కొండపల్లి యశోద, సహాయ కార్యదర్శిగా కె.కృష్ణ తులసి ఎన్నికయ్యారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు గోపాలం శంకరరావు, లక్ష్మి, కె.భారతి, నల్లపు శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మంగళగిరిలో రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు స్థానిక ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో బుధవారం రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు మాట్లాడుతూ ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు రణభేరి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి ఆంజనేయులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అడివి శ్రీనివాసరావు, మంగళగిరి టౌన్ అధ్యక్షులు సిహెచ్.అంకారావు, తాడేపల్లి ప్రధాన కార్యదర్శి ధన రాజారావు, మంగళగిరి మండల సహా అధ్యక్షులు పి.అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు సిహెచ్.రాధాకృష్ణ, సిహెచ్.శ్రీనివాసరావు, పద్మలత, రజనీకుమారి, చక్రవర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం పారిశుధ్య కార్మికుల ఆందోళన

నెక్కల్లులో మోకాళ్లపై నిలబడి.. ఖాళీ ప్లేట్లతో నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

రెండు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలంటూ రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులు ఆందోళన బాట పట్టారు. తుళ్లూరు, వెలగపూడి,మందడం, ఐనవోలు, అనంతవరం గ్రామాల్లో కార్మికులు చేపట్టిన ఆందోళనలు బుధవారంతో మూడవ రోజుకు చేరాయి. ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు జీతాల చెల్లింపులో అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరికి కార్మికులు పని విరామ సమయంలో నిరసన తెలిపారు. రెండు నెలల పెండింగ్ జీతాన్ని వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. నెక్కల్లులో మోకాళ్లపై నిలబడి ఖాళీ ప్లేట్లను చూపుతూ 'రెండు నెలలు జీతాలు ఇవ్వకపోతే బతికేదెట్లా..' అంటూ నిరసన తెలిపారు. కార్మికుల నిరసనలలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవి, అధ్యక్షులు సిహెచ్.సుశీల పాల్గొన్నారు. రవి మాట్లాడుతూ రాజధాని పారిశుధ్య కార్మికుల రెండు నెలల పెండింగ్ జీతం ఒకేసారి జమ చేయాలని డిమాండ్ చేశారు. రాజధానిలో పారిశుధ్య కార్మికులకు ఇచ్చే జీతాలు సరిపోక సగం మంది విధులు మానేశారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకుండా, అరకొర జీతాలు కూడా సక్రమంగా ఇవ్వకపోతే ప్రస్తుతం పని చేస్తున్న కొద్దిమంది పారిశుధ్య కార్మికులు విధులు మానేసే ప్రమాదం ఉందని రవి అన్నారు. సెప్టెంబర్ 12న 'చలో తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం' నిర్వహించి గ్రీవెన్స్‌లో అర్జీ అందజేస్తామని తెలిపారు. పెదకాకానిలో మహిళా పారిశుధ్య కార్మికులపై దాడి చేసిన వంశీని వెంటనే అరెస్ట్ చేయాలని రవి డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు పి.రత్నకుమారి, వి.అరుణ, మార్తమ్మ, భూలక్ష్మి, జ్యోతి, మాలతి, ముత్యాలు, తిరుపతమ్మ, కోటేశ్వరి, దుర్గ, సిఐటియు నాయకులు కుంభా ఆంజనేయులు పాల్గొన్నారు.



మందడంలో నిరసన తెలుపుతున్న రాజధాని పారిశుధ్య కార్మికులు

ఆప్కాస్ నుండి కార్మికులను తొలగించడాన్ని ఆపాలి



కార్మికులతో మాట్లాడుతున్న దొంతి రెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వీధులను శుభ్రం చేస్తూ, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఆప్కాస్ నుండి తొలగించటం ప్రభుత్వం మానుకోవాలని సిఐటియు తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి ఏపీ మున్సిపల్ పారిశుధ్య వర్కర్ల తాడేపల్లి మండల అధ్యక్షులు చౌక్కా మరియదాసు అధ్యక్షతన వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన ఒప్పందం ప్రకారమే ఆప్కాసును తొలగించకుండా కార్మికులను కొనసాగించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతన చట్ట ప్రకారం 26 వేల రూపాయలు పారిశుధ్య కార్మికులకు చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేస్తుంస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం దాటుతున్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆయన విమర్శించారు.సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులపై అధిక పని భారం వేయకుండా, అవసరమైన చోట కార్మికులను పెంచాలన్నారు. పని భద్రత కల్పిస్తూ, సబ్బులు, కొబ్బరి నూనెలు, గ్లౌజులు, చెప్పులు కార్మికులకు ఇవ్వాలన్నారు. కార్మికులకు రావాల్సిన హెల్త్ అలవెన్స్ లను వెంటనే ఇవ్వాలని అధికారులను ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికుల ప్రాతూరు గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. పారిశుధ్య గ్రామ అధ్యక్షులుగా ప్రాతూరు నాగేశ్వరరావు, కార్యదర్శిగా సిద్దెల ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా హనుమంతరావు, కోశాధికారి రవికుమార్ ఎన్నికయ్యారు.

రక్త కన్నీరు నాగభూషణంకు నివాళి

ప్రజాశక్తి - తెనాలి

ప్రజానాట్యమండలి తెనాలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణ సభలో భాగంగా రక్త కన్నీరు నాగభూషణంకు ఘనంగా నివాళు లర్పించారు. స్థానిక గాంధీ నగర్‌లోని ఇస్కస్ కార్యాలయంలో బుధవారం ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జి.లలితానంద ప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలే ఇతివృత్తంగా నాటిక, నాటకం, కళారూపాలన్నింటినీ రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించిన ఘనత నాగభూషణంకే దక్కుతుందన్నారు. రక్త కన్నీరు నాటకంతో ఆయన కళాభిమానుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, నాటకం పేరునే ఇంటిపేరుగా ప్రాచుర్యం పొందడం విశేషమని కొనియాడారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, మాన్యం బదరీనాథ్, మౌనిక, ఎల్.లక్ష్మణరావు, టి.బాలస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లలితానంద ప్రసాద్



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్


పోలీసుల వసతికి సిద్ధమైన కార్యాలయం

ప్రారంభించిన ఎస్‌పి సతీష్ కుమార్

ప్రజాశక్తి - తుళ్లూరు

ఇతర జిల్లాల నుంచి, బెటాలియన్ల నుంచి విధి నిర్వహణలో భాగంగా రాజధానికి వచ్చే పోలీసులకు వసతి కోసం తుళ్లూరులో వినియోగంలో లేని న్యాక్ కార్యాలయాన్ని సిఆర్‌డిఎ అధికారుల అనుమతితో పునరుద్ధరించారు. 100 మంది పోలీసులకు వసతి కల్పించేలా రూపుదిద్దుకున్న కార్యాలయాన్ని జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ సిఆర్‌డిఎ, తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో బందోబస్తు, భద్రతా విధులు నిర్వర్తించడానికి ఇతర జిల్లాలు, బెటాలియన్ల నుండి వచ్చే పోలీస్ సిబ్బందికి తాత్కాలిక నివాసానికి కొత్త వసతి సముదాయం ఏర్పాటు చేసినట్లు తలెఇపారు. సిఆర్‌డిఎ అధికారుల అనుమతితో వినియోగంలో లేని న్యాక్ కార్యాలయాన్ని ఆధునీకరించినట్లు తెలిపారు. 100 మంది పోలీస్ సిబ్బందికి సౌకర్యవంతంగా ఉండేలా సిద్ధం చేసినట్లు చెప్పారు. వసతి సిద్ధం చేయడంలో విశేష కృషి చేసిన జిల్లా అదనపు ఎస్పీ (ఎల్అండ్) ఎ.టి.వి.రవికుమార్, నార్త్ డిఎస్‌పి మురళీకృష్ణ, తుళ్లూరు డిఎస్‌పి టి.మురళీకృష్ణ, తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, కానిస్టేబుల్ జోషఫ్, హోంగార్డు జానీ బాషాను ఎస్‌పి అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో సిఐలు కొంకా శ్రీనివాస్, అంజయ్య, ట్రాఫిక్ సిఐలు కోటేశ్వరరావు, నరేష్, తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ పాల్గొన్నారు.





స్మార్ట్ రేషన్ కార్డు

తప్పుల తడకగా రేషన్ కార్డులు

ఉచితంగా సరిచేసి ఇవ్వాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులలో చాలామంది పేర్లు తప్పుల తడకలుగా ఉన్నాయని వెంటనే వాటిని ఉచితంగా సరి చేసి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. మండలంలోని ఆత్మకూరు గ్రామంలో సిపిఎం నేతలు కార్డుల పంపిణీని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. తప్పులుగా కార్డులు ఇస్తున్నారని వారు వాపోయినట్లు చెప్పారు. కూతురు మనవరాలుగా.. భర్త కొడుకుగా.. వరుసలు మార్చి ముద్రించారని తెలిపారు. కొంతమందికి ఆధార్ కార్డులో ఉన్న వయసు కంటే తక్కువగా ఎక్కువగా ముద్రించారన్నారు. ఈ తప్పులు వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ ద్వారా వచ్చే వివిధ సంక్షేమ పథకాలు నిలిపివేసే అవకాశం ఉందని, దీనిని సరి చేయాలని కార్డు మీద ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేస్తే స్పందించటం లేదన్నారు. సచివాలయ అధికారుల దగ్గరికి వెళితే ఫీజు చెల్లించి తప్పులను సరిచేసి మరో కొత్త కార్డు ఇస్తామని అనడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, శాఖ కార్యదర్శి గడ్డం అజయ్ కుమార్, చిట్టేల సీతారామాంజనేయులు, చింతల చెరువు జాను పాల్గొన్నారు.

రూ.4లక్షల 16వేలు ధర పలికిన గనేష్ లడ్డూ

ప్రజాశక్తి - తుళ్లూరు



లడ్డూ దక్కించుకున్న నాగేశ్వరరావు

రాజధాని అమరావతి పరిధి లోని తుళ్లూరు మండలం మందడం గ్రామంలోని వేణుగోపాలస్వామి గుడిలో బుధవారం వినాయకుడి ఊరేగింపు సందర్భంగా 61 కేజీల లడ్డూని వేలం వేశారు. వేలంలో లడ్డూను మందడం గ్రామానికి చెందిన దొండపాటి నాగేశ్వరరావు నాలుగు లక్షల 16 వేలకి దక్కించుకున్నారు.



జెసిబితో తొలగిస్తున్న కంపచెట్లు

కంపచెట్లను తొలగింపు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పురపాలక సంఘ పరిధిలోని కస్తుర్బా బాలికల పాఠశాల పరిసర ప్రాంతాలలో ముళ్లపొదలు పెరిగి విష సర్పాలు తిరుగుతున్నాయని ప్రిన్సిపాల్ మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తక్షణ చర్యలు తీసుకుని జెసిబి సాయంతో ముళ్లపొదలను తొలగించారు. బ్లీచింగ్ పొడిని మున్సిపాలిటీ తరపున సరఫరా చేశారు. స్కూల్ పరిసరాలు శుభ్రంగా మారడంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు.



సైడు కాల్వల్లో మురుగుతీస్తున్న కార్మికులు

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - మాచర్ల

విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ ఆదేశాల ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని మురుగుకాల్వల్లో పూర్తిగా మురుగు తొలగింపు పనులను చేపట్టారు. కమిషనర్ డి.వేణుబాబు ప్రత్యేక డ్రైవ్ ద్వారా 50 రోజులలో 17 మంది అదనపు సిబ్బందిని తీసుకొని మురుగు కాలువల పూడిక పూర్తిగా తొలగించి బయటకు తరలిస్తున్నారు. చెత్తను మురుగుకాల్వల్లో వేయవద్దని, చెత్తసేకరించే కార్మికులకు ఇవ్వాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు సహకరించకపోతే పారిశుధ్యం మెరుగుపడదన్నారు.

జగన్మోహన్ వ్యాఖ్యలు హేయం

కొమ్మాలపాటి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రాభివృద్ధికై అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చం నాయుడు పైన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు హేయమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ వైసిపి అయిదేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలు నరక యాతన అనుభవించారనీ, వైనాట్ 175 అంటూ ప్రజలతో మైండ్ గేమ్ ఆడారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా ఆయనలో, ఆపార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలలో ఎటువంటి మార్పు లేదన్నారు. నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలు తీశారని మద్యం కుంభకోణం నుండి ప్రజల దృష్టి మరల్చడానికి ధర్నాల పేరుతో రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని ఎద్దేవాచేశారు. తన మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి మిక్సింగ్ ప్లాంట్‌కు ప్రభుత్వ ఎరువులు అక్రమంగా తరలించి రైతులను ముంచిన జగన్మో హన్‌రెడ్డి ఎరువులు, ఎరువులంటూ అరవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

12న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12వ తేదీన పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పెదకూరపాడు ఎండిఓ సోమయాజులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాలు లోపు వయసుగల వారందరూ రక్తదానం చేయవచ్చునన్నారు.

పశువులు, గొర్రెల సంత ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వారాంతపు పశువులు గొర్రెల సంతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్‌యార్డ్ చైర్మన్ మొండితోక రాణి అన్నారు. రొంపిచర్ల వ్యవసాయ మార్కెట్‌యార్డ్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం పశువుల సంతను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రొంపిచర్ల మండలంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు పశు పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కృషితో సంత ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బుధవారం పశువుల సంత, గురువారం గొర్రెల సంత జరుగుతుందన్నారు. నరసరావుపేట మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ పాడి, పంట రైతుకు రెండు కళ్ళు



సంతను ప్రారంభిస్తున్న మొండితోక రాణి

లాంటివన్నారు. రైతులకు సరిపడా అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతుంటే వైసిపి ఎరువుల రాజకీయం చేస్తోందని విమర్శించారు. టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, నాయకులు వాసిరెడ్డి రవి, మొండితోక రామారావు, వడ్లమూడి వెంకట కిషోర్, కోటేశ్వరరావు, వట్టిగుంట నారాయణ పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

ప్రజాశక్తి -రెంటచింతల

15వ ఆర్థిక సంఘం నిధులు రెండవ విడతలో భాగంగా బేసిక్ టైడ్ నిధులు రూ.కోటి, లక్ష 18వేల 916లు విడుదలయ్యాయి. గ్రామాల వారీగా వివరాలు గోలి రూ.4,35,971, మల్లవరం రూ.6,15,512, జెట్టిపాలెం రూ.8,55,138, మంచికల్లు రూ.7,35,045, మిట్టగుడిపాడు రూ.382,743, పాలువాయి రూ.8,82,768, పాలువాయిగేటు రూ.3,80,084, పసర్లపాడు రూ.5,73,681, రెంటచింతల రూ.30,92,215, రెంటాల రూ.9,68,612, తుమ్మరకోట రూ.11,97,147లు మంజూ రయ్యాయి. ఈ నిధులను పారిశుద్ధ్యం, మంచినీరు, వీధి దీపాలు, సిబ్బంది జీతభత్యాలకు వినియోగించాల్సి ఉంది.

చంద్రబాబు మోసాలను వివరిస్తాం : వైసిపి

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో బుధవారం రాత్రి వైసిపి ఆధ్వర్యంలో "బాబూ షఉరిటీ -మోసం గ్యారెంటీ" కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు వడ్డేపల్లి నరసింహారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి, ఉద్యోగాల కల్పన వంటి వాగ్దానాలు అమలు కాలేదని, కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, శ్రేణులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనపై ప్రజలకు వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లా పేరయ్య, మద్దు శ్రీనివాసరావు, రాంబాబు, సీతయ్య, విప్పర్ల రామారావు, గుంటి జోసఫ్, షేక్ రసూల్ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి పెదకూరపాడు

ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య బృందాన్ని వైద్య శాఖ అధికారి డాక్టర్ రవి అప్రమత్తం చేశారు. బుధవారం పెదకూరపాడులోని సిహెచ్సి ఆస్పత్రిని పరిశీలించారు. వైద్య బృందంతో సీజనల్ వ్యాధులు, జ్వరాలుపై వివరాలు తెలుసుకున్నారు. తగు సూచనలు అందించారు. ఆయన వెంట డాక్టర్ వెలుగొండ రెడ్డి, సూపర్వైజర్లు దిలీపు, శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ఉన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నగేష్

పొలం పిలుస్తుంది కార్యక్రమం


ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని చంగిస్ ఖాన్‌పేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతుల నుద్దేశించి సీనియర్ శాస్త్రవేత్త ఎం.నగేష్ మాట్లాడుతూ పత్తి పంటలో 30, 60 రోజుల సమయంలో బస్తా యూరియ, బస్తా ఎంఓపి పంటకు వేయాలని తెలియ జేసినారు. పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి గుర్తిం చేందుకు ఎకరానికి 20 చొప్పున లింగాకర్షగా బట్టలను పంట ఎత్తు మీద అడుగు పైన ఉండేటట్లుగా ఏర్పాటు చేసు కోవాలని తెలిపారు. సింథటిక్ పైరిత్రాయుడు మందులను 100 రోజులు పైబడిన మొక్కలపై మాత్రమే వాడాలన్నారు. మిరపనారునాటే ముందు దుక్కిలో 10కిలోల వేప పిండిలో, కార్బోఫ్యురాన్ గుళికలతో కలిపి వేయటం వలన వేరుకొల్లు, వేరే తెగులు నివారించవచ్చన్నారు. పంట మార్పిడి చేయటం వల్ల మిరపలో తామర పురుగుల ఉధృతిని, నల్లి తీవ్రతను తగ్గించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులకు తగినంత యూరియా లభించేలా చర్యలు తీసుకున్నామనీ, ఎవరూ ఆందోళన చెంద వలసిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, గ్రామ వ్యవసాయ సహాయకులు జోత్స్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతులతో భయం...భయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలంలోని విజయపురి సౌత్ గ్రామంలో ఇంటి నుంచి బయటకు రావాలంటే వీధికుక్కలు, కోతులతో భయంగా ఉందని ఎమ్మార్పిఎస్ నాయకుడు ఊరే మార్క్ తెలియజేశారు. చిన్నపిల్లలు పాఠశాలకి వెళ్లేదారిలో మందలుగా కుక్కలు, కోతులు రోడ్ల వెంబటి ఉండటంతో పిల్లలు భయపడుతూ పాఠశాలకి వెళ్తున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో చాలా చోట్ల చిన్నపిల్లలను వీధి కుక్కలు కరచి, గాయపరడం, చంపడం వంటి దృశ్యాలు కనపడుతున్నాయనీ, కోతులు కూడా మనుషులపై ఎగబడి వారి వద్ద ఉన్న



వీధిలో గుంపులుగా ఉన్న కుక్కలు

వస్తువులను లాక్కొని వెళ్లే పరిస్థితులు ఉన్నాయన్నారు. పిల్లలు, మహిళలు ఒంటరిగా బజార్లలో నడిచే పరిస్థితి లేదన్నారు. తక్షణమే, ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పిఎఫ్ సౌకర్యం కల్పించండి : ఎస్టీయు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చిలకలూరిపేట పట్టణ శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం చిలకలూరిపేట పట్టణంలోని అన్ని మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయు లతో సభ్యత్వం చేయించారు. ఎస్టీయూ రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు దశాబ్ద కాలంగా పిఎఫ్ ఖాతా లేదనీ, ప్రభుత్వం స్పందించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా డీఎస్సీ 2025లో ఉపాధ్యాయులను పాఠశాలలకు కేటాయించాలని కోరారు. మున్సిపల్ పరిధిలో జూనియర్ కళాశాలలు, కొత్తగా ఏర్పడిన కాలనీలు, టిడ్కో గృహాల వద్ద నూతన పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. పాఠ శాలలు లేని ప్రాంతాల్లో నుండి ఆటోలలో ప్రయాణిస్తున్న విద్యార్థులకు ప్రయాణభత్యం సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టియు పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్లాన జయప్రకాష్ ఆర్థిక కార్య దర్శి హనుమంతు నాయక్ జిల్లా కౌన్సిలర్ షేక్ జమీర్ బాష, ఎస్టియు నాయకులు సామ్యూల్ అట్లూరి శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ న్యాయవాదిగా శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల రూరల్



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

మాచర్ల పురపాలక సంఘం న్యాయవాదిగా మాచర్ల పట్టణానికి చెందిన అడ్వకేట్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ డి. వేణు బాబు చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ మదర్ సాహెబ్, కమిషనర్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మద్దిగపు చిన్న వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

శేషారావుకు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి - పెదకూరపాడు

శ్రీశ్రీ కళావేదిక తెలుగుభాషా దినోత్సవ సందర్భంగా 'తేనె లొలుకు తెలుగుభాష' అనే అంశంపై కవిత పోటీలు నిర్వహించారు. పోటీలలో పెదకూరపాడుకు చెందిన ప్రజాకవి దర్శి శేషారావు విజేతగా నిలిచారు. ఆయనకు ప్రశంసాపత్రాన్ని అందించారు. సాహిత్య రంగంలో ఇప్పటికే ఆయన పలు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఆయనను అధికారులు, శ్రేయోభిలాషులు, మిత్రులు అభినందించారు.

గోనుగుంట్ల లీలావతి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఈపూరు

శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి జన్మదిన వేడుకలను ఈపూరులోని కేజీబీవీ పాఠశాలలో మండల టిడిపి నాయకులు బుధవారం నిర్వహించారు. విద్యార్థినిలచే కేక్ కట్ చేయించారు. అనంతరం అందరికీ సీట్లు పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఆర్ జగ్గారావు, మండల అధ్యక్షులు ఆర్ మురళి,డీసీ చైర్మన్ జి వేణు, అంగలూరు సొసైటీ అధ్యక్షులు టి బాలయ్య, ఎన్ కిషోర్,జి వీరాంజనేయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు

మై బడ్డీ గ్రీన్ డ్రైవ్ - 2025

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామ పరిధిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో చెట్ల పెంపకంపై మెగా మైబడ్డీ గ్రీన్‌డ్రైవ్-2025ను నిర్వహించినట్లు రోటరీ క్లబ్ నరసరావుపేట ప్రెసిడెంట్ షేక్. కరీమ్ మొహి ద్దీన్ బుధవారం తెలిపారు. ముఖ్యఅతిధులుగా రోటరీ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్‌గవర్నర్ డాక్టర్ యస్.వి.రామ్ ప్రసాద్, పల్నాడు జిల్లా ఫారెస్ట్ ఉన్నతాధికారి కె.అశోక్‌కుమార్ హాజరయ్యారు. రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో నరికివేతకు గురవుతున్న మహావృక్షాలు లేని లోటు తీర్చలేనిదన్నారు. వాటి స్థానంలో వెసులుబాటు ఉన్నచోట మొక్కలను నాటి వాటిని మహా వృక్షాలుగా మలిచే బాధ్యత తీసుకుంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించినట్లు జిల్లా ఫారెస్ట్ ఉన్నతాధికారి కె. అశోక్‌కుమార్ అన్నారు. కళాశాల చైర్మన్ షేక్. మీరావలి ప్రిన్సిపల్ డాక్టర్ జి. నాగమల్లే శ్వరరావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్.మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్.నజీమా, ఎన్ఎస్ఎస్. అధికారి హెచ్.గంగాధర్‌రావు, రెడ్‌క్రాస్ కిరణ్, రోటరీక్లబ్ సభ్యులు అన్నే రత్న ప్రభాకర్, తాళ్ళరాజశేఖరరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ రాఘవయ్య, సింగరావు, ఎం.సుబ్బారావు, పున్నారావు, జె.రాధాకృష్ణ, పి.రమేష్, ఏం. వెంకటేశ్వరరావు, షేక్. జిలాని మాలిక్, ఆర్. శ్రీనివాసరావు, పి.కృష్ణారావు, అత్యుత రావు, ఎం.సుమిత్ర, ఈశ్వర్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

281వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావలసిన బకాయిల కోసం ఎసిపి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 281వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ సభ్యులు షేక్ సుభాని, వె. సాంబశివరావు, బి.అంకయ్య, తుపాకుల నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షలలో మహిళలు వై.రమాదేవి, ఈ. శారమ్మ, షేక్ ఇమాంబి, టి.దుర్గాభవాని, వి.రిబ్కా కూర్చున్నారు. సిఐటియు నాయకులు వి.దుర్గారావు, యూనియన్ సెక్రటరీ కె.స్టీవెన్ మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో ఎం.ఆశీర్వాదం, ఎన్.సుబ్బారావు, వై.సుబ్బారావు, జి.వెంకటేశ్వర్లు, దేవా, డి.నాగేశ్వరావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

పెదకాకాని గ్రామపంచాయతీ మహిళా కార్మికులపై కులం పేరుతో దూషించి, దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకొని, అరెస్టు చేయాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల పట్ల పెదకాకానిలో కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేసిన దానబోయిన వంశీని పోలీసు అధికారులు వెంటనే అరెస్టు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటన లు జరగకుండా చూడాలని, సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పి.సంతోషం, సువార్త, రాంబాబు, బాలయ్య, రాణి, అనూష, బాబ్జి, సీమోను, జి.కొండయ్య, శశికళ, విమల పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-పెదనందిపాడు

కామ్రేడ్ కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి సందర్భంగా కొల్లా వెంకయ్య మెమోరియల్ లైబ్రరీలలో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేట్, శ్రీశ్రీ గేయాల పోటీలు నిర్వహిస్తామని డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు బుధవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ శుక్రవారం "మత వేడుకలలో మితిమీరిన ఖర్చులు పెట్టడం అవసరమా" అనే అంశం మీద వ్యాసరచన, 15వ తారీకు సోమవారం క్విజ్ పోటీలు, 16వ తారీకు మంగళవారం ప్లాస్టిక్‌తో ప్రమాదం ఏమిటి? ప్లాస్టిక్ వాడకం ఎలా ఆపాలి? అనే అంశం మీద డిబేట్, శ్రీ శ్రీ గేయాల పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 17 వ తారీకు బుధవారం జరిగే వర్ధంతి సభలో పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని గొడవర్రు, గుండవరం రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ యూరియా వాడకం తగ్గించి మిశ్రమ ఎరువు వాడేవిధంగా రైతులు ముందుకు రావాలని కోరారు. మిశ్రమ ఎరువులు ద్వారా మొక్కకి అవసరమైన నత్రజని, భాస్వరం, పోటాష్ ఒకే ఎరువులో మొక్కకి అందుతుందని వివరించారు. అలాగే రైతులు నానో యూరియా, డిఎపి కూడా వాడాలని సూచించారు. 'ఈ'పంట నమోదు గురించి రైతులకు తెలిపారు. ప్రతి ల్యాండ్ పార్సిల్ 'ఈ' పంట కింద నమోదు చేయించు కోవాలని కోరారు. రైతు సోదరులకు అవసరమైన ఎరువులు రైతు సేవ కేంద్రాల ద్వారా మరియు సొసైటీ ద్వారా అందు బాటులో ఉంచడం జరుగుతుందని తెలియచేశారు. వరిలో వచ్చే తెగుళ్లు, కలుపు నివారణపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రైతులు పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో రసాయన ఎరువులను తగ్గించు కోవచ్చని, అవసరం మేరకే వాడాలని జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ సునీత అన్నారు గురువారం కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం, ప్రకృతి వ్యవసాయ అధ్వర్యంలో రైతులకు వరి పంటలో వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ వరి పంటలో అవసరం ఉన్నంత వరకే ఎరువులను వాడలని, అలాకాక ఎక్కువ వాడితే భూమికి నష్టం కలుగుతుందన్నారు. రసాయణలు వాడకం వలన కాన్సర్ రోగులు ఎక్కువ అవుతున్నారని, రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువులు వాడాలని తెలిపారు. అలానే రైతులు తమ పొలాల్లో పంట వ్యర్థాలను తగల పెట్టకూడదు అని వివరించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ యూరియా డి.ఏ.పి.లకు ప్రత్యామ్నాయంగా ఘన ద్రవ జీవామృతం వాడు కోవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయ రైతులు షేక్ మౌలాలి మోహన్ రావు వారి అనుభవాలను రైతులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ మున్నంగి గ్రామ సర్పంచ్ దీనమ్మ, ప్రకఅతి వ్యవసాయ సిబ్బంది , ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ సునీత





హాజరైన విద్యార్థులు, బోధిస్తున్న బౌద్ధ గురువు సింఘు థెక్‌చెన్ (ఫెలిక్స్ లీ)

ఆత్మహత్యలు నివారించాలని అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో బుధవారం నాడు అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ దినోత్సవ సందర్భంగా వాల్యూ ఎడ్యుకేషన్ సెల్, ఎఫ్ ఇడి, ఎన్ సిసి విభాగాల ఆధ్వర్యంలో విద్యార్ధి సంక్షేమ విభాగం డీన్ పర్యవేక్షణలో ఆత్మహత్య నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా విద్యార్థులు చిరునవ్వులతో బతకాలి, చిరంజీవిగా బతకాలి అంటూ నినాదాలు చేశారు. విద్యార్ధి సంక్షేమ విభాగం డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ జీవితం లో ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని అన్నారు. ప్రతీ అపజయం మరో గొప్ప విజయానికి పునాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్యూ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ మానవ జీవితం అందమైనది అని అన్నారు. చిన్న చిన్న పొరపాట్లకు కుంగి పోకుండా వాటిని సరిచేసు కుంటూ ముందుకు వెళ్ళాలన్నారు. ఆవేశపూరిత మైన నిర్ణయాలు మంచివి కావని తెలియజేసారు. అనంతరం అంతర్జాతీయ ఆత్మ హత్యల నివారణ దినోత్సవ సందర్భంగా జరిగిన పోస్టర్ ప్రదర్శన లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ పార్ధ సారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ రాజశేఖర్ రావు, డాక్టర్ ఎన్.వెంకట రామన్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్ధి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్, అసోసియేట్ డీన్ శ్రీధర్, వాల్యూ డ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్, కన్వీనర్ ఎ. భాను ప్రియాంక, కార్యక్రమ కో ఆర్డినేటర్ ఎ.విజయరత్నం, కార్యక్రమ డైరెక్టర్ శంకరి, ఇతర సైకాలజిస్టులు రాజేశ్వరి, శిరీష, శ్రీనాథ్, కిషోర్ పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంది.. ఆందోళన వద్దు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రైతులకు కావలసిన యూరియా అందుబాటులో ఉంది ఎవరూ ఆందోళన చేదనసవరం లేదని ఎ.డి. ఎ.ఎన్. మోహన్ రావు అన్నారు. బుధవారం కోయవారిపాలెం, కొండేపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎఓ సుగుణాబేగం మాట్లాడుతూ ప్రత్తి పంట ఆశించు రసం పీల్చే పురుగు నివారణ ఒక ఎకరాకి లీటర్ నీటిలో 5 మిల్లీ లీటర్ల వేప నూనె కలిపి పిచికారి చేయాలి, గులాబీ రంగు నివారణ కొరకు ఆకర్షిక బుట్టలను ఎకరానికి ఎనిమిది నుండి పది బుట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. దాని ఉద్రిక్తత గమనించుకుంటూ ఉండాలన్నారు. అనంతరం మండలంలో యూరియా మీ చెంతకు కార్యక్రమం భాగంగా మోహన్ ట్రేడర్, పయనీర్ ఎంటర్ ప్రైజెస్, అమర లింగేశ్వర ఫెర్టిలైజర్స్ పురుగు మందుల దుకాణలను సందర్శించి స్టాక్ తనిఖీ చేశారు. దుకాణ యజమానులకు యూరియా 266.50కి మాత్రమే అమ్మాలి లేక పోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం సఫలం

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ ముందు ముందు మరెన్నో పథకాలు అమలు చేయనున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక రైలుపేటలోని అన్న క్యాంటీన్ వద్ద బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భువనేశ్వరి దేవి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి పేదలకు ప్రత్యేక ఉచిత అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోటు బడ్జెట్ ఉన్న ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పార్టీ నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు గద్దె శ్రీనివాస్. జంపాల నరేంద్ర, నక్క చిరంజీవి, పఠాన్ జున్ను ఖాన్, ఏడుకొండలు, నాయుడు బాబురావు, గద్దె శివకుమారి, షేక్ నసీమున్నీసా, రావురి చిట్టెమ్మ, శివకోటేశ్వరి, ఆదిపూడి వెంకటేశ్వరమ్మ, వాసిరెడ్డి పద్మ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు



దుస్తులు అందజేస్తున్న దాతలు

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత

ప్రజాశక్తి - తెనాలి

అంగలకుదురు విఎస్సార్ అండ్ జెడిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు బుధవారం బహుకరించారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తల తోటి సుభాషిణి తన భర్త జోసెఫ్ జ్ఞాపకార్థం 25 మంది విద్యార్థులకు దుస్తులు బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎన్.అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛందంగా దాతలు సహకరించటం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో టి.నోయల్, ప్రత్యక్ష, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులు

కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి

తెనాలి రోడ్డు చేనేత వ్యాపార పరిరక్షణ & రోడ్డు విస్తరణ బాధితుల సంఘ నూతన కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కన్వీనర్‌గా జొన్నాదుల గురుమోహనరావు, కో-కన్వీనర్లుగా పణిదపు వీరాస్వామి, ఎస్.ఎ.సిలార్, సభ్యులుగా చింతక్రింది సాంబశివరావు, ఎం.వి.ఎస్.నాగేశ్వరరావు, జొన్నాదుల విజయ్‌కుమార్, వెనిగళ్ళ పోతురాజు, సయ్యద్ మహమ్మద్ అలీ, కాటాబత్తుని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ కమిటీ బాధితుల తరపున మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులతో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. విస్తరణ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా కృషి చేయడమే కమిటీ ప్రధాన లక్ష్యమని సంఘం కన్వీనర్ జొన్నాదుల గురుమోహనరావు తెలిపారు.



మెడల్స్ అందుకున్న విద్యార్థులతో కోచ్, నిర్వాహకులు

కరాటేలో హరి హంసిక విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన హరి హంసిక డ్యాన్స్ అండ్ తైక్వాండో ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు జపాన్ కరాటే, రాష్ట్రస్థాయి సెలభమ్ పోటీలలో సత్తా చాటారు. ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన 7వ జాతీయ స్థాయి సమురాయి జపాన్ కరాటే, రాష్ట్ర స్థాయి సెలభమ్ టోర్నమెంట్‌లో పాల్గొని, 15 స్వర్ణ పతకాలు, 5 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించినట్లు ఇన్‌స్టిట్యూట్ కోచ్ ఎం.చిన్న తెలిపారు. సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం తరపున సత్యనారాయణ, టోర్నమెంట్ నిర్వాహకులు కావూరి నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ ఎం.చిన్న మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయం వారి శ్రమకు నిదర్శనమని, తల్లిదండ్రుల సహకారం, పిల్లల కృషి కలిస్తే ఎలాంటి విజయాన్నైనా అందుకోవచ్చని అన్నారు.

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో జిఎంసికి 6వ ర్యాంక్

ప్రజాశక్తి-గుంటూరు

మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్) చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 6వ ర్యాంక్ దక్కింది. దక్షిణ భారతదేశంలో కేవలం గుంటూరు నగరానికే ఈ అవార్డు వచ్చింది.ఈ సందర్భంగా నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వాయు సర్వేక్షణ్ పోటీల్లో దేశవ్యాప్తంగా 130 నగరాలు పోటీ పడ్డాయని, అందులో 10 లక్షల లోపు జనాభా కేటగిరీలో గుంటూరు నగరానికి 6వ ర్యాంక్ దక్కటం గర్వకారణం అన్నారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయిలో సూపర్ సిటీగా అవార్డు సాధించినట్లు గుర్తు చేశారు.

జెసిగా బాధ్యతలు స్వీకరించిన అశుతోష్ శ్రీవాస్తవ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా సంయుక్త కలెక్టర్‌గా నియమితులైన అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదలీల్లో ఆయన్ను గుంటూరు జిల్లాకు నియమించారు. పదవీ భాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన జాయింట్ కలెక్టర్‌కు డిఆర్ఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, గుంటూరు ఆర్‌డిఒ కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎ.ఓ పూర్ణచంద్రరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ తాసీల్దార్లు సుభానీ, వెంకటేశ్వర్లు, పొన్నూరు, తాడికొండ తహశీల్దార్లు వెంకటస్వామి, మొహర్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జేసీ



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో జావా ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్‌పై బుధవారం హ్యాకథాన్ నిర్వహించారు.మేక్ స్కిల్డ్ సిఇఒ పర్వతనేని మధు, టెక్నో ఫీచర్ ఇండియా సిఇఒ శివ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐటి మూడో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. 39 బృందాలు పాల్గొని వారి ప్రాజెక్టులను వివరించారు.అందులో మొదటి బహుమతి పొందిన మీటర్ మ్యాప్ అనే యాప్‌నకు రూ.5వేలు నగదు బహుమతి లబించింది. రెండోబహుమతిని ఫిర్యాదుల నిర్వహణ యాప్‌నకు రూ.3వేల నగదు బహుమతి అందచేశారు. మూడవ బహుమతి పొందిన క్యాంపస్‌కార్డ్ యాప్‌నకు రూ.2వేలు అందచేశారు. మెమోరియ యాప్‌నకు కన్సోలేషన్ బహుమతి లభించింది.కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.సుబ్బారావు, సెక్రెటరీ కె.శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధి చేసిన ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. సాంకేతికతలో ఆవిష్కరణల ఆవశ్యకతను, విద్యార్థుల యొక్క పాత్రను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు తెలియజేశారు. ఈ సమావేశానికి ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్.ఎస్.సాయి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేటెంట్ ఫైలింగ్‌పై చలపతిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు



మట్లాడుతున్న కెఎల్ఎస్.రెడ్డి

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో ఎంఎస్ఎంఇ- ఐపిఎఫ్‌సి ఆధ్వర్యంలో 'పేటెంట్ ఫైలింగ్, జియోగ్రాఫికల్ ఇండికేషన్ స్టడీస్' అనే అంశంపై రెండ్రోజులపాటు జరిగే వర్క్‌షాప్ ప్రారంభం అయ్యింది. ఈవర్క్‌షాప్‌లో మేధోసం పత్తి హక్కుల ప్రాముఖ్యత, పేటెంట్ దాఖలు చేసే విధానం, జియోగ్రా ఫికల్ ఇండికేషన్ స్టడీస్‌లో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలు వంటి కీలక అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ-డిఎఫ్ఒ, ఐఈడిఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కెఎల్ఎస్.రెడ్డి, గుంటూరు అంకాన్స్ స్పెషలిస్ట్ కన్సల్టెంట్ టి.ఆర్.రమేష్, గుంటూరు వోక్స్ ఫాంటమ్ ఐపిఆర్ అటార్నీ ఎం.సుధీర్ పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగించారు. వర్క్‌షాప్‌కి చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు అధ్యక్షత వహించారు. డాక్టర్ కెఎల్ఎస్.రెడ్డి మాట్లాడుతూ జియోగ్రాఫికల్ ఇండికేషన్ ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన ఉత్పత్తి, కళాకృతికి లభించే గుర్తింపు అని తెలిపారు. ఇది ఆప్రాంతపు భౌగోళిక పరిస్థితులు, సంప్రదాయ పద్ధతులు, స్థానిక నైపుణ్యాల వల్ల ఏర్పడిన ప్రత్యేకతను కాపాడుతుందన్నారు. ఉదాహరణకు గుంటూరు మిరపకాయలు, తిరుపతి లడ్డూ, డార్జిలింగ్ టీ వంటివన్నారు. జిఐ ట్యాగ్ ద్వారా స్థానిక రైతులు, కళాకారులు, ఉత్పత్తిదారులు నేరుగా ప్రయోజనం పొందుతారని, నకిలీ ఉత్పత్తులు మార్కెట్లోకి రావటం ఆగుతుందన్నారు. టి.ఆర్. రమేష్ మాట్లాడుతూ పేటెంట్ ఫైలింగ్, మరియు జియోగ్రాఫికల్ ఇండికేషన్ స్టడీస్ నేటి జ్ఞానాధారిత సమాజంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలని, ఇవి ఆవిష్కరణలను, పరిశోధనలను, ప్రాంతీయ ప్రత్యేకతలను రక్షించడమే కాకుండా, దేశ ఆర్థికాభివద్ధి, సాంకేతిక ప్రగతికి బలమైన పునాదిగా నిలుస్తాయన్నారు. ఎం. సుధీర్ మాట్లాడుతూ పేటెంట్ అనేది ఒక కొత్త ఆవిష్కరణ లేదా సాంకేతికతపై ఆవిష్కర్తకు చట్టబద్ధంగా లభించే హక్కు అని, దీనివల్ల ఆవిష్కరణను ఇతరులు అనుమతి లేకుండా తయారు చేయడం, అమ్మడం, వాడుకోవడం నివారించబడుతుందన్నారు. పేటెంట్ దరఖాస్తు ప్రక్రియలో వివిధ దశలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ప్రసంగించారు.

13న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ పడదగ్గ కేసులలో వాహన ప్రమాద బీమా ద్వారా చనిపోయిన, గాయ పడిన వ్యక్తులకు, వారి కుటుంబ సభ్యులకు వారసత్వ హక్కు ద్వారా ఇన్సూరెన్స్ నగదును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం వలన సత్వరంగా లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. చెక్‌బౌన్స్ కేసులలో కూడా ఇరు వర్గాలు సులభ వాయిదా పద్ధతిలో కానీ, ఒకేసారి చెల్లించే విధంగా మాట్లాడుకొని అవార్డు పొంది కేసును పరిష్కరించు కోవచ్చని తెలిపారు. చిన్న చిన్న క్రిమినల్ కేసులు, మైంటెనెన్సు కేసులు కుటుంబ వివాదాల కేసులలో కూడా మాట్లాడుకొని సత్వరమే రాజీ చేసు కోవచ్చని తెలిపారు. అలాగే సివిల్ దావాలలో, బ్యాంకు కేసులు (డబ్బుకు సంబందించినవి), విభజన దావాలు , శాశ్వత ఇంజక్షన్ దావాలు , భూ వినియోగం కేసులు (ఎల్ఎఒపి కేసులు), ప్రీ లిటిగేషన్ కేసులనూ మాట్లాడుకోవటం ద్వారా రాజీచేసుకోవచ్చున్నారు. కావున కక్షిదారులందరూ సమయాన్ని వృధా కాకుండా త్వరిత గతిన కేసులను పరిష్కరించుకొని న్యాయం పొంద డానికి ఈ జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాగరాజు మద్దిరాలకు నాయుడమ్మ పురస్కారం

శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని ప్రజలకు చేరువచేసిన నాయుడమ్మ

డాక్టర్ నాయుడమ్మ పురస్కార ప్రదానోత్సవ సభలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



జ్యోతి ప్రజ్వలనలో తెలంగాణ గవర్నర్ , పురస్కార గ్రహీత

ప్రజాశక్తి తెనాలి : శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు పరిచయం చేసిన శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడమ్మ పురస్కార ప్రధానోత్సవం బుధవారం స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాధ బాబు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదగా 1993 బ్యాచ్ ఐఎఎస్ అధికారి, భారత ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి నాగరాజు మద్దిరాలకు డాక్టర్ నాయుడమ్మ పురస్కారాన్ని ప్రధానం చేశారు. నాగరాజు దంపతులను ఘనంగా సత్క రించారు. ముఖ్యఅతిథి జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ప్రజల అభివృద్ధికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తోడ్పడాలని నాయుడమ్మ తపించారన్నారు. ఆయన జీవితకాలం అదే దృక్పథంతో పనిచేసే అనితర సాధ్యమైన విజయాలను సొంతం చేసుకున్నారని చెప్పారు. వికసిత భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఆర్థికరంగంలో నాగరాజు కృషి చేశారని, పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లారని చెప్పారు. త్రిపుర రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఆ రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శిగా ఉన్న నాగరాజుతో తనకు ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. పురస్కార గ్రహీత మద్దిరాల నాగరాజు మాట్లాడుతూ దేశంలో ఆధునికతకు అర్థం పట్టే రీతిలో డాక్టర్ నాయుడమ్మ పరిశోధనలు ఆవిష్కరణలు జరిగా యని, ఆ ప్రయోజనాలం సమాజానికి ఉపయోగపడేలా కృషి చేశారని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాన్ని సామాన్యులకు నాయుడమ్మ చేరువ చేశారని చెప్పారు. చెన్నైలోని జాతీయ చర్మ పరిశోధనా సంస్థ ముఖ్య కార్యదర్శి డాక్టర్ స్వర్ణ వి.కాంత్ తన ప్రసంగంలో డాక్టర్ నాయుడమ్మను 'నేషన్ బిల్డర్'గా అభివర్ణించారు. దేశంలోని 37 జాతీయ పరిశోధనశాలలకు అధిపతిగా చేసిన నాయుడమ్మ తామందరికీ ఎంతో స్ఫూర్తిగా నిచ్చారన్నారు. ఎగుమతులు ప్రధానమైన తోలు పరిశ్రమలో ఇతర దేశాలు టారిఫ్ లు పెంచిన నేపథ్యంలో 2030 నాటికి 50 బిలియన్ డాలర్ల వృద్ధిని సవాలుగా చెబుతూ నాయుడమ్మ చూపిన బాటలో అధిగమనిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఫౌండేషన్ వైస్‌చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం నాయుడమ్మ విశిష్టతను కొనియాడారు. నాయుడమ్మపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను బహూకరించారు. అయినాల మల్లేశ్వరరావు, తమిరిశ అనంతాచార్యులు, నందకిషోర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



మాట్లాడుతున్న వెంకటయ్య

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవటానికి ప్రతి ఒక్కరూ కర్తవ్యం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. చుండూరు దళిత పల్లెవీరుడు కొమ్మెర్ల అనిల్‌కుమార్ 34వ వర్థంతి సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ' దళిత గిరిజన హక్కుల పరిరక్షణలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్నా ఇంకా దళితులు, గిరినులపై దాడులు జరుగుతూనే ఉన్నా యన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సంఘాలు, పౌరులు అడగాలన్నారు. హక్కులు అమలైనప్పుడు అంద్కేర్ ఆశయం నెరవేరు తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల కోసం కమిషన్ కాపలాగా పనిచేస్తుందని చెబుతూ కమిషన్ చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కమిషన్ కృషి ద్వారా అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు వెయ్యి మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించటం దేశంలోనే చారిత్రాత్మ కమైందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు సహజం అయ్యాయని, ఇటువంటి ఘటనల్లో కుల పంచాయతీలు చేసి, బాధితుల నోర్లు మూయించం సర్వ సాధారణం అయ్యిందన్నారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగం కల్పించిన రూల్ ఆఫ్ లాను కాపాడుకోవటానికి హక్కుగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో సుప్రీం కోర్టు సైతం రూల్ ఆఫ్ లాను విస్మరిస్తుందన్నారు. రూల్ ఆఫ్ లాకు రాజ్యాంగం ప్రతీక అని, దానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. సదస్సుకు డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరవి వినియ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం బాగ్యారావు, కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షత వహించారు. సభలో ఏసీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గురవయ్య, న్యాయవాది శాంతకుమార్, రిటైర్డ్ డిఎస్పీ కె.రవికుమార్, ఎస్‌బిఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరీ మేడికొండ సునీల్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల సంఘం నాయకులు రమావత్ కృష్ణానాయక్ తదితరులు ప్రసంగించారు. అనం తరం అంబేద్కర్ భావజాలంతో పని చేస్తున్న సామాజిక ఉద్యమ నాయకులకు దళిత వీర్ అవార్డులు అందచేశారు.

ఆర్‌విఆర్ జెసిలో నేత్రదాన దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

అంధకారంలో ఉన్న జీవితాలకు నేత్రదానం ద్వారా వెలుగు నింపవచ్చని కంటి శస్త్ర నిపుణులు డాక్టర్.షఫీల అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు, అవగాహన శిబిరం నిర్వహించారు. పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యుల బందం పాల్గొని విద్యార్థులకు నేత్ర సంబంధిత రుగ్మతలు, కంటి సంరక్షణ పద్ధతులు, ఆరోగ్యకరమైన అలవాట్లపై సూచనలు అందించారు.డాక్టర్ షఫీల విద్యార్థులు ఎక్కువసేపు కంప్యూటర్లు, మొబైల్స్ వినియోగించడం వల్ల అనేక రకాల కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. పాఠ్యాంశాలను మొబైల్ స్క్రీన్‌ల ద్వారా కాకుండా పుస్తక రూపంలో చదవటం మంచి దన్నారు. నేత్రదానం చేయడం ద్వారా మరణానంతరం కూడా జీవించి, ఈలోకాన్ని రెండోసారి చూసే అవకాశాన్ని పొందుతారని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్‌విఆర్ అండ్ జెసి అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ షఫీల